సాక్షి రంగారెడ్డి
గురువారం । 19 । అక్టోబర్ । 2023



ప్రజలు మోసపోవద్దు

ఎన్నికలు రాగానే బీజేపీ, కాంగ్రెస్ నేతలు మభ్య పెట్టేందుకు వస్తారని ప్రజలు మోసపో వద్దని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు.

10లో▸



జల్సాలకు అలవాటుపడి చోరీలు

జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

10లో▸

డీఎస్పీ ‘పట్నం’ అభ్యర్థిగా రవీందర్

ఇబ్రహీంపట్నం: ధర్మ సమాజ్ పార్టీ ఇబ్రహీం పట్నం నియోజకవర్గం అభ్యర్థిగా తులసిగారి రవీందర్‌ను ప్రకటించారు. తనకు అవకాశం కల్పించిన ఆ పార్టీ అధ్యక్షుడు డా.విశారదన్ మహరాజ్‌కు బుధవారం రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్‌రీల్

ఎన్నికల ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్

కలెక్టర్ భారతి హోళికేరి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శాసనసభ ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కంట్రోల్ రూమ్‌లో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. 040- 23238545 నంబర్‌కు ఫోన్ చేసి ఎన్నికల అంశాలపై ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫిర్యాదులను సిబ్బంది ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేసుకుంటారని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, ఓటర్లు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు

మీర్‌పేట: తెలంగాణలో ప్రజలంతా మార్పు కోరుకుంటున్నారని, ఈసారి కాంగ్రెస్‌కు అధికారం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ విలేజ్, శివశంకర్‌నగర్‌లో బుధవారం ఆయన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమం, అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రకటించిందని, అధికారం చేపట్టిన వెంటనే వీటిని పూర్తి స్థాయిలో అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, నాయకులు కీసర యాదిరెడ్డి, చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, దేవగోని కృష్ణ, వెంకటేష్‌గౌడ్, ఏడుదొడ్ల సురేందర్‌రెడ్డి, ఆల శ్రీనివాస‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు జాతీయ ప్రతిభా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి బుధవారం జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. అమెరికా గ్లోబల్ క్రియేటీవ్ ఆర్ట్స్ అకాడమీ, అంతర్జాతీయ ఫిలంత్రోఫిక్ సొసైటీ, శ్రీశ్రీ కళావేదిక, పుడమి సాహితీ వేదిక, మహారాష్ట్ర, తమిళనాడు, ఏపీ, పాండిచ్చేరి తెలుగు అసోసియేషన్లు సంయుక్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి జాతీయ పురస్కారాలను అందజేశాయి. ఈ సందర్భంగా న్యూ ఢిల్లీలోని ఆంధ్రా భవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ ఎస్‌కే రహమాన్ చేతుల మీదుగా రవీందర్‌రెడ్డి అవార్డు అందుకున్నారు.

80 ఏళ్లు దాటిన వారికి ఫామ్ 12డీ ఇవ్వండి



మాట్లాడుతున్న ఆర్డీవో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: ఎనభై ఏళ్లు దాటిన వృద్ధ ఓటర్లకు వచ్చే నెల 3లోపు ఫామ్ 12డీ అందజేయాలని ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం శేరిగూడ సమీపంలోని శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేస్తారా..? పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటేస్తారా..? వారినే అడగాలని సూచించారు. 12 డీ ఫామ్ ప్రకారం వారి ఇష్టానుగుణంగా ఓటు వేసే అవకాశం కల్పించాలని ఆదేశించారు. నవంబర్ 8వ తేదీ లోపు అలాంటి ఓటర్ల సంసిద్ధతను తెలియజేయాలన్నారు. వీల్‌చైర్లు అవసరమైన వారిని, వైకల్యం ఉన్నవారిని గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని వివరించారు. ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం తగదని స్పష్టంచేశారు. సమావేశంలో తహసీల్దార్ అన్వర్, రవీందర్‌దత్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

దూకుడు!



ఎన్నికల పోరాటంలో జోరు పెంచిన ప్రధాన పార్టీలు

- ప్రచారంలో తలమునకలైన బీఆర్‌ఎస్ అభ్యర్థులు
- రెండో జాబితా కోసం ఎదురుచూస్తున్న కాంగ్రెస్ ఆశావహులు
- ఫస్ట్ లిస్ట్‌లో పేరు చూసుకోవాలని కమలం నేతల ఆరాటం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో అన్ని రాజకీయ పార్టీలు దూకుడు పెంచాయి. అధికార బీఆర్‌ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించడంతో పాటు బీఫామ్‌లు, ప్రచారం ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.40 లక్షలు అందజేసింది. దీంతో ఓ వైపు చేరికలు.. మరో వైపు ప్రచారంతో ఆ పార్టీ అభ్యర్థులు దూసుకుపోతున్నారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో ఇప్పటికే ఓసారి నియోజకవర్గాలను చుట్టేసిన కేండెట్లు.. రెండో దఫా పర్యటనలకు శ్రీకారం చుట్టారు. వీరితో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు, అనుచరులు ఇలా.. మండలాలు, గ్రామాల వారీగా బాధ్యతలు తీసుకుని ప్రచారం చేస్తున్నారు.

- మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం తుక్కుగూడ, సర్దార్‌నగర్ గ్రామాల్లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.
- షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ చటాన్‌పల్లిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.
- కల్వకుర్తి అభ్యర్థి గుర్క జైపాల్ యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ తలకొండపల్లి మండలం జంగారెడ్డిపల్లిలో ప్రచారం చేశారు.
- చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య తరఫున ఆయన కుమారుడు, జెడ్పీటీసీ సభ్యుడు కాలె శ్రీకాంత్ మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్, ముర్తాజగూడలో పర్యటిస్తూ ఓటర్లను కలిశారు.

అలకలు.. బుజ్జగింపులు

- కాంగ్రెస్ పార్టీ ఇటీవల 55 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను విడుదల చేసింది.
- షాద్‌నగర్, చేవెళ్ల, కల్వకుర్తి అభ్యర్థులను ప్రకటించింది.
- ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి అభ్యర్థుల పేర్లను ఇప్పటికీ వెల్లడించలేదు.
- ఆయా నియోజకవర్గాల్లోని ఆశావహులంతా రెండో జాబితాపైనే ఆశలు పెట్టుకున్నారు.
- టికెట్ చేజిక్కించుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.
- ఇప్పటికే మొదటి జాబితాలో టికెట్ వచ్చిన వారు ఓవైపు అలకబూనిన నేతలను బుజ్జగిస్తూనే మరో వైపు ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు.
- మొదటినుంచి కల్వకుర్తి టికెట్ ఆశించిన ఎన్‌ఆర్‌ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అధిష్టాన నిర్ణయంపై ఆగ్రహంతో ఉన్నారు. నాలుగు రోజుల క్రితమే ఇటు కేడర్‌కు, అటు ముఖ్య నేతలకు అందుబాటులో లేకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అనంతరం ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పోటీ చేయాలని భావించారు. అయితే పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హామీతో కొంత వెనక్కితగ్గినట్లు తెలిసింది.
- టికెట్ దక్కించుకున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం ఉదయం స్వయంగా ఆయన ఇంటికి చేరుకుని, తన గెలుపు కోసం సహకరించాలని కోరినట్లు విశ్వసనీయ సమాచారం.
- చేవెళ్ల నియోజకవర్గంలో సీనియర్లను కాదని, జూనియర్‌కు టికెట్ ఇవ్వడాన్ని తప్పుపడుతున్నారు.
- రెండు రోజుల క్రితం ఇద్దరు కీలక నేతలు మొయినాబాద్ మండల కేంద్రంగా వేర్వేరు సమావేశాలు ఏర్పాటు చేసి, అసంతృప్తిని వెల్లగక్కారు.
- దీంతో టికెట్ దక్కించుకున్న అభ్యర్థి భీం భరత్ అలకబూనిన సీనియర్ నేతలను బుజ్జగించే పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది. స్వయంగా వారి ఇంటికి వెళ్లి.. పార్టీ గెలుపు కోసం పని చేయాలని అభ్యర్థిస్తుండటం విశేషం.
- మహేశ్వరం, ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం టికెట్ల విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడంతో ఎవరికి వారు.. తామే ఎమ్మెల్యే అభ్యర్థులమని చెప్పి.. ఇంటింటి ప్రచారం చేసుకుంటున్నారు.

తొలి జాబితాలో చోటెవరికో..?

- బీజేపీ గురువారం విడుదల చేయనున్న తొలి జాబితాలో మహేశ్వరం, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లు దాదాపు ఖరారైనట్లు తెలిసింది.
- ఎల్బీనగర్, షాద్‌నగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి అభ్యర్థులను రెండో దశలో ప్రకటించే అవకాశం ఉంది. ఆయా చోట్ల టికెట్ ఆశిస్తున్న నేతలు.. అధిష్టాన నిర్ణయంపై ఆతృతగా ఉన్నారు.
- అభ్యర్థుల ప్రకటన తర్వాత పార్టీలో ఇప్పటి వరకు ఉన్న అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బహిర్గతమయ్యే అవకాశం లేకపోలేదు.
- మహేశ్వరంలో అందెల శ్రీరాములు, ఎల్బీనగర్‌లో సామ రంగారెడ్డి, రాజేంద్రనగర్‌లో తోకల శ్రీనివాసరెడ్డి, శేరిలింగంపల్లిలో రవికుమార్ యాదవ్‌లు ఇప్పటికే ప్రచారం ముమ్మరం చేశారు.
- షాద్‌నగర్ టికెట్ కోసం ముగ్గురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో ఎవరికి టికెట్ వస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది.
- ఇబ్రహీంపట్నంలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పోటీ చేయనున్నారని తెలుస్తోంది.

‘చేతులు’ కలిశాయా?

- సుంకిరెడ్డి, కసిరెడ్డి మధ్య కుదిరిన సయోధ్య
- రంగంలోకి దిగిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- రాఘవేందర్‌రెడ్డి రాజకీయ భవిష్యత్తుపై హామీ



కసిరెడ్డి నారాయణరెడ్డి



సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మధ్య సయోధ్య కుదిరిందా..? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. త్వరలోనే సుంకిరెడ్డి కాంగ్రెస్ ప్రచార పర్వంలోకి రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆదినుంచి హస్తం పార్టీ తరఫున కల్వకుర్తి టికెట్ ఆశించిన ఆయన కసిరెడ్డికి టికెట్ ఇవ్వడంతో అలక పానుపు ఎక్కారు. దీంతో రంగంలోకి దిగిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి.. రాజకీయ భవిష్యత్తుపై సుంకిరెడ్డికి భరోసా ఇచ్చినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ నారాయణరెడ్డి బుధవారం ఉదయం రాఘవేందర్‌రెడ్డి నివాసానికి వెళ్లి మాట్లాడినట్లు తెలిసింది.

జోష్ నింపిన సుంకిరెడ్డి

వెల్దండ మండలం చౌదర్‌పల్లికి చెందిన ఎన్‌ఆర్‌ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఏడాదిన్నర కాలంగా ఐక్యత ఫౌండేషన్ పేరుతో నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనతో దూసుకుపోయారు. ఈక్రమంలో కల్వకుర్తి వ్యాప్తంగా సుమారు రూ.20 కోట్లకు పైగా పనులు చేశారు. ఐదు నెలల క్రితం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్ర నేత రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటి నుంచి స్థానిక నాయకులతో కలిసి కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేశారు. సుంకిరెడ్డి రాకతో కల్వకుర్తి కాంగ్రెస్‌లో జోష్ వచ్చింది. ఈ నేపథ్యంలో ఆయన కల్వకుర్తి టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. టికెట్ తనకే వస్తుందని ధీమాగా ఉన్నారు. అనూహ్యంగా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడం, అధిష్టానం ఆయనకే టికెట్ కేటాయించడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.

అనుచరుల ఒత్తిడి

కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో ఇండిపెండెంట్‌గా పోటీచేయాలని రాఘవేందర్‌రెడ్డి అనుచరులు, అభిమానులు ఆయనపై ఒత్తిడి తెచ్చారు. ఈ మేరకు మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి, అందరి అభిప్రాయాలు తీసుకున్నారు. భవిష్యత్తు కార్యాచరణపై సమాలోచనలు జరిపారు. అంతేకాకుండా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి సుంకిరెడ్డి బరిలో ఉంటారని చెప్పుకొన్నారు.

సుంకిరెడ్డికి బుజ్జగింపులు

సుంకిరెడ్డి బరిలో ఉంటే విజయావకాశాలపై ప్రభావం పడుతుందని భావించిన కాంగ్రెస్ అధిష్టానం ఆయనతో చర్చలు జరిపింది. రెండు రోజుల క్రితం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి.. రాఘవేందర్‌రెడ్డిని కలిసి బుజ్జగించినట్లు సమాచారం. పార్టీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్సీ ఇవ్వడంతో పాటు సముచిత స్థానం కల్పిస్తామని హామీ దక్కడంతో కొంత మెత్తబడ్డట్లు సమాచారం.



గండిపేట చౌరస్తా వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

రూ.4 లక్షల నగదు సీజ్

మొయినాబాద్: ఎన్నికల సందర్భంగా పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. మొయినాబాద్ మండల పరిధిలోని గండిపేట చౌరస్తా వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ప్రత్యేక బృందంతో కలిసి చెకింగ్స్ కొనసాగిస్తున్నారు. బుధవారం చేపట్టిన తనిఖీల్లో హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ కారులో రూ.4 లక్షల నగదును పట్టుకున్నారు. సరైన ఆధారాలు చూపించకపోవడంతో డబ్బులను సీజ్ చేశారు.

ఏసీబీ వలలో అవినీతి చేపలు

- రూ.2.50 లక్షల నగదుతో పట్టుబడిన కందుకూరు ఎంపీఓ, రాచులూరు పంచాయతీ కార్యదర్శి
- ఇరువురిపై కేసు నమోదు చేసిన అవినీతి నిరోధక శాఖ అధికారులు



కార్యదర్శి నరేందర్



ఎంపీఓ కళ్యాణి

కందుకూరు: అనుమతుల పేరుతో బెదిరించి లంచం తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ భద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు మండలం రాచులూరు పంచాయతీ పరిధిలో ఎంఆర్‌కే బ్రిక్స్‌తో పాటు వైష్ణవి కన్స్ట్రక్షన్స్ పేరుతో మాధవరెడ్డి అనే వ్యక్తి రెడీమిక్స్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నాడు. అన్ని అనుమతులు తీసుకుని ఏడాదిగా దీన్ని కొనసాగిస్తున్నాడు. కాగా, ప్లాంట్‌కు హెచ్‌ఎండీఏ అనుమతులు లేవని పేర్కొంటూ ఇటీవల కందుకూరు ఎంపీఓ పసలాడి కళ్యాణి, పంచాయతీ కార్యదర్శి డేరంగుల నరేందర్ ద్వారా.. నోటీసులు జారీ చేశారు. అనంతరం ప్లాంట్‌కు హెచ్‌ఎండీఏ పర్మిషన్ లేదని, భవిష్యత్‌లో ఈ విషయమై ఎలాంటి ఇబ్బంది ఉండకూడదనుకుంటే తమకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరకు రూ.2.50 లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. ఇదిలా ఉండగా అధికారులకు డబ్బు ఇవ్వడం ఇష్టంలేని నిర్వాహకుడు ఈ నెల 13న ఏసీబీని ఆశ్రయించాడు. ఎంపీఓ సూచన మేరకు బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నగదు తీసుకునేందుకు వచ్చిన పంచాయతీ కార్యదర్శిని డబ్బుతో పాటు పట్టుకున్నారు. అనంతరం అతన్ని రాచులూరు పంచాయతీ కార్యాలయానికి తరలించారు. ఎంపీఓ కళ్యాణిని సైతం అక్కడికే రప్పించి విషయాన్ని వివరించారు. అనంతరం ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. దాడుల్లో ఏసీబీ అధికారులు ప్రశాంత్, సతీష్, నరేష్‌కుమార్ బృందం పాల్గొంది.

అనేక ఆరోపణలు

ఎంపీఓ కళ్యాణి ఐదు నెలల క్రితమే బదిలీపై కందుకూరుకు బదిలీపై వచ్చారు. ఆమె వచ్చిన తర్వాత ఎవరూ ఎలాంటి ఫిర్యాదులు చేయకుండా తానే పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తెచ్చి పలువురికి బలవంతంగా నోటీసులు ఇప్పించారనే ఆరోపణలు ఉన్నాయి.

రిజిస్ట్రేషన్లు తగ్గాయ్!



- గ్రేటర్ రియల్టీపై ఎన్నికల ప్రభావం
- నెల రోజుల్లో 5 శాతం క్షీణత
- గత నెల 6,185 ప్రాపర్టీల రిజిస్ట్రేషన్లు
- నైట్‌ఫ్రాంక్ ఇండియా అధ్యయనంలో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: స్థిరాస్తి రంగంపై ఎన్నికల ప్రభావం పడింది. రాజకీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నికలకు శంఖారావం పూరించడంతో.. గృహ కొనుగోలుదారులు ప్రాపర్టీ కొనుగోళ్లపై సందిగ్ధంలో పడ్డారు. దీంతో అంతకుముందు నెలతో పోలిస్తే సెప్టెంబరులో గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టాయి. గత నెలలో గ్రేటర్‌లో రూ.3,378 కోట్ల విలువ చేసే 6,185 ప్రాపర్టీలు రిజిస్ట్రేషన్లు జరిగాయి. నెల రోజుల వ్యవధిలో ప్రాపర్టీ విలువలో 2 శాతం, రిజిస్ట్రేషన్లలో 5 శాతం క్షీణత నమోదైందని నైట్‌ఫ్రాంక్ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది. గ్రేటర్‌లో ఆగస్టులో రూ.3,461 కోట్ల విలువ చేసే 6,493 ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి.

ఖరీదైన ఇళ్లకే గిరాకీ..

విలాసవంతమైన గృహాలపైనే కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తున్నారు. గత నెలలో జరిగిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లలో రూ.కోటి కంటే ఎక్కువ ధర ఉన్న ఖరీదైన ఇళ్ల వాటా 9 శాతంగా ఉంది. గతేడాది సెప్టెంబరులో ఈ గృహాల వాటా 8 శాతం. రూ.25 లక్షలు నుంచి రూ.50 లక్షలు మధ్య ధర ఉండే మధ్యస్థాయి ఇళ్ల వాటా గత సెప్టెంబరులో 55 శాతం కాగా.. ఇప్పుడది 51 శాతానికి తగ్గాయి. రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య ధర ఉండే ప్రాపర్టీల వాటా ఏడాదిలో 13 శాతం నుంచి 17 శాతానికి పెరిగాయి.

6.4 శాతం పెరిగిన ధరలు..

గ్రేటర్‌లో జిల్లాల వారీగా చూస్తే ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లలో హైదరాబాద్ వాటా 14 శాతం కాగా మేడ్చల్–మల్కాజిగిరి 45 శాతం, రంగారెడ్డి వాటా 41 శాతంగా ఉంది. గత నెలలోని రిజిస్ట్రేషన్లలో ఈ ప్రాపర్టీల వాటా 9 శాతంగా ఉంది. 1,000 నుంచి 2,000 చ.అ. మధ్య విస్తీర్ణం ఉన్న ఇళ్ల వాటా 71 శాతంగా ఉంది. ఏడాది కాలంతో పోలిస్తే గ్రేటర్‌లో ప్రాపర్టీ ధరలు సగటున 6.4 శాతం మేర పెరిగాయి.

‘విశ్వరూప’ పాదయాత్ర



మహేశ్వరం గేటు నుంచి పాదయాత్రగా వెళ్తున్న మంద కృష్ణమాదిగ

- మందకృష్ణకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ నేతలు
- కలిసి నడిచిన దేప భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తలపెట్టిన విశ్వరూప మహా సభ పాదయాత్ర బుధవారం మహేశ్వరం మండలం గుండా బాలాపూర్‌కు చేరుకుంది. మహేశ్వరం గేటు వద్ద పాదయాత్ర చేసుకుంటూ వెళ్తున్న మందకృష్ణకు.. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. కొద్దిసేపు ఆయనతో కలిసి నడిచారు. విశ్వరూప మహా సభ పాదయాత్రకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తోందని స్పష్టంచేశారు. కృష్ణ మాదిగ కందుకూరు మండల కేంద్రం నుంచి మహేశ్వరం గేటు, తుక్కుగూడ, పహాడీషరీఫ్, మల్లాపూర్, బాలాపూర్, బాలాపూర్ చౌరస్తా వరకు పాదయాత్రగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్, బాకీజాన్, ఇమ్రాన్ అలీ, సంతోష్ కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు రావుగళ్ల బాబు మాదిగ, నర్సింహ మాదిగ, బక్కని రవి మాదిగ, ప్రశాంత్, శేఖర్, కృష్ణ, జగన్, గణేశ్, రాకేశ్, ఆర్జున్, చంద్రయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అత్యంత నివాసయోగ్య నగరంగా హైదరాబాద్

యూఎన్‌ఎఫ్‌ఏఓ సదస్సులో మేయర్ విజయలక్ష్మి

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ఏర్పాటు అనంతరం హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత నివాసయోగ్య నగరంగా మారిందని మేయర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు హైదరాబాద్‌లో ఐటీ సంస్థల ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నాయన్నారు. బుధవారం వాషింగ్టన్ డీసీలో జరిగిన యునైటెడ్ నేషన్ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ (యూఎన్‌ఎఫ్‌ఏఓ) ఈవెంట్‌లో ప్రత్యేక వక్తగా ఆమె పాల్గొని ప్రసంగించారు. ‘తెలంగాణకు హరిత హారం’ విజయ గాథను వివరించారు. హైదరాబాద్ నగరంలో రోడ్ల వెంబడి, సెంట్రల్ మీడియన్లలో విస్తృతంగా మొక్కలు నాటినట్లు తెలిపారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో, పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ, ప్రభుత్వ కార్యాలయాల్లో పెద్ద ఎత్తున పచ్చదనం పెంపొందించడంతో పాటు ట్రీ పార్కులు, పంచతత్వ పార్కులు, మేజర్ పార్కుల అభివృద్ధి, కాలనీ పార్కులలో విరివిగా మొక్కలు నాటడం, ప్రతి ఇంటికి ఉచితంగా మొక్కల పంపిణీ, ఫ్లైఓవర్ల కింద గార్డెన్లు, ఫ్లైఓవర్ల పిల్లర్లకు వర్టికల్ గార్డెన్ల ఏర్పాటు వంటి వాటితో హైదరాబాద్‌ను పచ్చని, పర్యావరణ అనుకూ ల నగరంగా మార్చడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఇతర ప్రాంతాలకు స్ఫూర్తిదాయకమైన నగరంగా మార్చినట్లు పేర్కొన్నారు. పచ్చదనం పెంపునకు చేపట్టిన పనులు ప్రతికూల ప్రభావాలను తగ్గించేందుకు దోహదపడిందన్నారు.

పక్షి జాతులను సంరక్షిద్దాం



పక్షుల గురించి విద్యార్థులకు వివరిస్తున్న షఫతుల్లా

- డెక్కన్ బర్డర్స్ స్వచ్ఛంద సంస్థ మాజీ కార్యదర్శి షఫతుల్లా
- నేచర్ క్యాంప్ ఫర్ చిల్డ్రన్స్ అంశంపై అవగాహన సదస్సు

కడ్తాల్: మన పరిసరాల్లోని పక్షి జాతులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని డెక్కన్ బోర్డ్స్ సంస్థ మాజీ గౌరవ కార్యదర్శి షఫతుల్లా అన్నారు. అన్మాస్‌పల్లిలోని ఎర్త్ సెంటర్‌లో లీఫ్ ఎడ్యుకేషన్ సెంటర్ విద్యార్థులకు బుధవారం నేచర్ క్యాంప్ సదస్సు నిర్వహించారు. దీనికి హాజరైన డెక్కన్ బర్డర్స్ సంస్థ మాజీ గౌరవ కార్యదర్శి షఫతుల్లా, సంస్థ సభ్యుడు సామ్యూల్ సుకుమార్, పర్యావరణ నిపుణురాలు సురేఖ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా షఫతుల్లా ప్రసంగిస్తూ.. ప్రపంచ వ్యాప్తంగా 11,600 రకాల పక్షులు బిలియన్ల సంఖ్యలో ఉన్నాయన్నారు. ఏటా భారతదేశానికి 460 రకాల పక్షి జాతులు వలస వస్తున్నాయని, దేశంలో 1,360 రకాల పక్షి జాతులు ఉన్నాయని తెలిపారు. తెలంగాణలోనూ 367 రకాల పక్షి జాతులు ఉన్నాయని పేర్కొన్నారు. వివిధ కారణాలతో పక్షుల జనాభా 49 శాతానికి తగ్గిందని, కొన్ని కోట్ల జీవరాశులు సముద్రంలో జీవనం సాగిస్తున్నాయని వివరించారు. మానవాళి మనుగడకు పక్షులు ఎంతగానో దోహదపడుతున్నాయని, రైతులు సాగు చేసిన పంటలపై ఉన్న క్రిమికీటకాలను తినడం ద్వారా రైతులకు మేలు చేస్తున్నాయని స్పష్టంచేశారు. అనంతరం డెక్కన్ బర్డర్స్ సంస్థ సభ్యులు సామ్యూల్ సుకుమార్ శిలలు, ఖనిజాలు, జీవావరణం అంశాలను వివరించారు. పర్యావరణ నిపుణురాలు సురేఖ ప్రసంగిస్తూ.. ఊర పిచ్చుకల సంరక్షణ, పర్యావరణం, పక్షులు, జీవావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎర్త్‌సెంటర్ పరిసరాల్లో ఉన్న పలు రకాల జీవజాతులను పరిశీలించి, విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, సీజీఆర్ సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, ఎర్త్‌సెంటర్ డైరెక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి, నందకుమార్, జయంతిమిత్ర, అజిత్‌కుమార్, లీఫ్‌సెంటర్ నిర్వాహకులు రజనీకాంత్, సీజీఆర్ ప్రతినిధులు రతం వెంకటేశ్, కోటేశ్ పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

- విద్యార్థుల రాష్ డ్రైవింగ్‌తో ఆగిపోయిన ఐదేళ్ల ప్రయాణం
- కళాశాల ఎదుట గ్రామస్తుల ధర్నా


రాజు(ఫైల్)


శ్రీశైలం(ఫైల్)

శంకర్‌పల్లి: ఇద్దరు మిత్రుల ఐదేళ్ల ప్రయాణం విద్యార్థుల రాష్ డ్రైవింగ్‌తో ఆగిపోయింది. నిమిషాల వ్యవధిలోనే ఇరువురూ ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన బుధవారం మోకిల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం మండల పరిధిలోని జనవాడకు చెందిన బ్యాగరి రాజు(40) శేరిలింగంపల్లిలోని ఓ కంపెనీలో సూపర్‌వైజర్, మోత్కుపల్లి శ్రీశైలం(31) ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి. రోజు మాదిరిగానే వారు బైక్‌పై విధులకు బయలుదేరారు. గ్రామ శివారులోకి కొల్లూరు రోడ్డులో ఇక్ఫాయి కళాశాల విద్యార్థులు అతివేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టారు. దీంతో రాజు ఘటనాస్థలిలోనే మృతి చెందగా.. శ్రీశైలంను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే తుదిశ్వాస విడిచాడు. రాజుకు భార్య మమత, ముగ్గురు సంతానం . శ్రీశైలంకు ఏడాదిన్నర క్రితం సంధ్యతో వివాహమైంది. మృతదేహాలను చికిత్స నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. ఇద్దరు మిత్రుల మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కళాశాల ఎదుట ధర్నా

మృతుల కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని.. ప్రమాదానికి కారణమైన విద్యార్థులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలోనూ శంకర్‌పల్లి–హైదరాబాద్ ప్రధాన రహదారిపై కార్ రేసింగ్ నిర్వహించి ఓ మహిళ ప్రాణాలను బలిగొన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల విద్యార్థులు గంజాయి, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని ఆరోపించారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోకిల సీఐ నరేశ్, శంకర్‌పల్లి సీఐ వినాయకరెడ్డి కళాశాల వద్దకు చేరుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ప్రజలు మోసపోవద్దు

- సంక్షేమ పాలన కొనసాగింపునకు 'కారు'కు ఓటేయండి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్


చటాన్‌పల్లి ప్రచారంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: ఎన్నికలు అనగానే బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రజలను మభ్య పెట్టేందుకు గ్రామాలకు వస్తారని ప్రజలు మోసపోవద్దని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పాలన కొనసాగాలంటే ప్రజలు మరోసారి కారు గుర్తుపై ఓటేయాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశం దృష్టిని ఆకర్షిస్తున్నాయన్నారు. బడుగుల అభ్యున్నతి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. పల్లెలు, పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, మాజీ చైర్మన్ అగ్గనూరు విశ్వం, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రాంరెడ్డి, చింటు, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గులాబీ' గూటికి 'కమలం'నేతలు

జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిర గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీకి చెందిన నాయకులు ముర్షద్ మురళి, నర్సింలు, ప్రవీణ్‌రెడ్డి మొగులయ్య, నరేశ్‌గౌడ్, శ్రీనివాస్, శివప్రసాద్, అంజయ్య, తాజ్, అశోక్, వెంకట్‌రాంరెడ్డి, యాదయ్య, వెంకటయ్య, చెన్నయ్య తదితరులు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

రాంగ్‌రూట్ ప్రయాణంతో ప్రమాదం

- బైక్‌ను ఢీకొట్టిన కారు
- దంపతులకు తీవ్ర గాయాలు

మొయినాబాద్: రాంగ్‌రూట్‌లో ప్రయాణంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటన మండలంలోని పరిధిలోని చిలుకూరులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన గూడెం మార్క్‌సన్, గీత దంపతులు మంగళవారం రాత్రి హిమాయత్‌నగర్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. పెద్ద చెరువు కట్టపైకి రాగానే రాంగ్‌రూట్‌లో ఎదురుగా అతివేగంతో వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో దంపతులిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. మార్క్‌సన్ కాలు విరిగ్గా.. గీత తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గీత పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆస్తి కోసం దారుణం

మరిది దాడిలో గాయపడిన మహిళ మృతి

పహాడీషరీఫ్: మరిది దాడిలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఇమాంగూడకు చెందిన సునీల్ కుమార్‌కు ఆషోడ మహేశ్వరి(27)తో 2016లో వివాహమైంది. 2021లో డెంగీ వ్యాధితో సునీల్‌కుమార్ మృతి చెందాడు. భర్త ద్వారా ఆమెకు వచ్చే ఆస్తిపై కన్నేసిన అత్తింటి వారు మానసికంగా, శారీరకంగా వేధించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్త శకుంతల, ఆడ పడుచులు సునీత, నందిని, సునిత భర్త మధులపై గృహ హింస కేసు నమోదయింది. ఎలాగైన మహేశ్వరిని హతమార్చాలనే ఉద్దేశ్యంతో ఆమె భర్త తమ్ముడు అనిల్‌కుమార్ ఈ నెల 2న ఆమె తలపై పదునైన ఆయుధంతో బలంగా దాడి చేయడంతో కోమాలోకి వెళ్లింది. విషయం తెలుసుకున్న పోలీసులు మరిది అనిల్‌కుమార్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నాటి నుంచి డీఆర్‌డీఓ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందింది. గతంలో నమోదైన కేసును హత్య కేసుగా మారుస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న క్రేన్ ఆపరేటర్ మృతి

కొత్తూరు: విధుల్లో ఉండగా ప్రమాదవశాత్తు క్రేన్‌లో పడిన ఆపరేటర్ మృతి చెందాడు. ఈ ఘటన మున్సిపల్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ శంకర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పట్టణానికి చెందిన నందుపాల్(51) వినాయకస్టీల్ పరిశ్రమలో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న ఉదయం క్రేన్‌ను ఆపరేట్ చేస్తుండగా అందులో ఇరుక్కుని తీవ్రంగా గాయపడ్డాడు. పరిశ్రమ నిర్వాహకులు వెంటనే చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు హమిత్‌పాల్ యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వందేళ్లు నిండిన ఓటర్లు ఐదుగురు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో వందేళ్లు దాటిన ఓటర్లు ఐదుగురు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 5,53,590 మంది ఓటర్లలో 0.01 శాతం 100–109 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న ఓటర్లు ఉన్నారన్నారు. మొత్తం ఐదుగురు వంద సంవత్సరాలు దాటిన ఓటర్లు ఉన్నారన్నారు.

రౌడీషీటర్ అరెస్ట్

రాజేంద్రనగర్: రౌడీషీటర్ సర్వర్ హత్య కేసులో రౌడీషీటర్ ఖూనీ గౌస్‌ను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులకు లొంగిపోవాలని సర్వర్ ఖూనీ గౌస్‌కు తెలపడంతో ఆగ్రహించి సర్వర్‌ను గత వారం హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఖూనీ గౌస్‌తో పాటు అతనికి సహకరించిన ఇద్దరిని పోలీసులు మంగళవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. ఖూనీ గౌస్ కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తుండటంతో తన ఇద్దరు అనుచరులతో కలిసి లొంగిపోయాడు. ఖూనీ గౌస్ అనుచరుడు కోర్టును ఆశ్రయించాడు. ఖూనీ గౌస్ పోలీసులకు లొంగిపోయాడని.. కానీ పోలీసులు అరెస్ట్ చూపడం లేదంటూ కోర్టును ఆశ్రయించడంతో పోలీసులు మంగళవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. సర్వర్‌ను హత్య చేసిన సమయంలో ఖూనీ గౌస్ మరో ఇద్దరిని హత్య చేసిన అనంతరం పోలీసులకు లొంగుతానని వెల్లడించడంతో పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. హత్యకు ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఖూనీ గౌస్‌పై మరోసారి పీడీ యాక్ట్ కోసం ఉన్నతాధికారులకు సిఫారసు చేసినట్లు ఏసీపీ గంగాధర్ తెలిపారు.

జల్సాలకు అలవాటుపడి చోరీలు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సాయిశ్రీ

- ఒక ఆటో, పది బైక్‌లు స్వాధీనం
- ఇద్దరు నిందితులకు రిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్: జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బుధవారం ఎల్‌బీ నగర్ డీసీపీ సాయిశ్రీ అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్‌లో కేసు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా కోటపహాడ్ మండలానికి చెందిన మచ్చ రూపేశ్ వనస్థలిపురంలో నివసిస్తున్నాడు. రూపేశ్, బండారి శివ(బైక్ మెకానిక్) ముఠాగా ఏర్పడి పార్కింగ్ చేసిన వాహనాలను ఎత్తుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నెల 17న దొంగిలించిన బైక్‌పై ప్రయాణిస్తుండగా పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్ద పోలీసులకు చిక్కారు. దీంతో వారిని లోతుగా విచారించగా పది బైక్‌లు, రూ.10.40లక్షల విలువైన ఒక ఆటో ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకోవడంతో వారి వద్ద నుంచి వాహనాలు రికవరీ చేశారు. ఈ సమావేశంలో ఏసీపీ భీంరెడ్డి, ఇన్‌స్పెక్టర్ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

కార్మికురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

కేశంపేట: విధి నిర్వహణలో ఉండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన మున్సిపల్ కార్మికురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని దత్తాయపల్లికి చెందిన గంట్లవెళ్లి లావణ్య షాద్‌నగర్ మున్సిపాపల్ కార్మికురాలిగా విధులు నిర్వహిస్తుంది. ఆమె కోర్టు పరిసరాలల్లో పనులు చేస్తుండగా మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు బుధవారం ఆమె భౌతిక కాయానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మృతురాలి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటుగా ఆర్థికసాయం అందజేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు ఈ కార్యక్రమంలో శ్రీనునాయక్, ఈశ్వర్, శ్రీనివాస్, శివ, కృష్ణయ్య, జంగయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం సుభిక్షం


జంగారెడ్డిపల్లిలో మాట్లాడుతున్న వెంకటేశ్ గుప్తా తదితరులు

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను మరోమారు ఆశీర్వదించండి
- మిషన్ భగీరథ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌గుప్తా

తలకొండపల్లి: బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని.. నిత్యం అభివృద్ధికి పాటుపడే ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మరోమారు అవకాశం ఇవ్వాలని మిషన్ భగీరథ కార్పొరేషన్ వైస్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్‌గుప్తా ప్రజలను కోరారు. బుధవారం ఆయన మండల పరిధిలోని జంగారెడ్డిపల్లిలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలు కొనసాగాలంటే కల్వకుర్తి కారు గుర్తుకే ఓటేయాలని కోరారు. సీఎం కేసీఆర్ బడుగు, బలహీన వర్గాల ఉన్నతి కోసమే నిరంతరం శ్రమిస్తారని చెప్పారు. రాష్ట్రంలో అత్యధిక అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుని అధికారం చేపట్టడం ఖాయమన్నారు. కల్వకుర్తి గడ్డపై ఎగిరేది గులాబీ జెండాయే అన్నారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్, ఎంపీపీ తిర్మణి నిర్మలాశ్రీశైలంగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ ముజీబర్ రహ్మాన్, రైతు బంధు మండల కో ఆర్డినేటర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, సర్పంచ్ సంఘం మండలాధ్యక్షుడు గోపాల్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నర్సింహ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు ,మాజీ సర్పంచ్‌లు, సింగిల్‌విండో డైరెక్టర్‌లు, మార్కెట్ డైరెక్టర్లు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో రూ.కోటి సీజ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో బుధవారం వరకు కోటి రూపాయలను సీజ్ చేసినట్లు ఏసీపీ గంగాధర్ వెల్లడించారు. ఎన్నికల నియమావళి అమలైన రోజు నుంచి విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామన్నారు. తనిఖీల సమయంలో ఎలాంటి దస్తావేజులు, నగదుకు సంబంధించిన వివరాలను తెలపకపోవడంతో కోటి రూపాయలను స్వాధీనం చేసుకొని ట్రెజరీలో జమ చేశామన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో నేషనల్ పోలీసు అకాడమీ, పీవీ నర్సింహరావు ఎక్స్‌ప్రెస్ వే, పిల్లర్ నంబర్–118, పల్లె చెరువు, పాలమాకుల ప్రధాన రహదారి, టిప్పుఖాన్ బ్రిడ్జి వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు.

కారులో తరలిస్తుండగా..

శంషాబాద్ రూరల్: అర్ధరాత్రి కారులో తీసుకెళ్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన తనిఖీలో భాగంగా.. శంషాబాద్ పోలీసులు మంగళవారం రాత్రి మండలంలోని నర్కూడ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సమయంలో శంషాబాద్ పట్టణానికి చెందిన వ్యాపారి గౌత వినయ్ తన కారులో కవేలిగూడ వైపు నుంచి శంషాబాద్ వస్తున్నాడు. నర్కూడ వద్ద కారును ఆపి తనిఖీ చేయగా.. అందులో రూ.2,39,900 నగదు పట్టుబడింది. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి రశీదులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపారు.

గంజాయి స్మగ్లర్‌కు రిమాండ్

రూ.3లక్షల విలువైన 12.5కిలోలు గంజాయి స్వాధీనం


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

ఆమనగల్లు: ఆంధ్రప్రదేశ్ నుంచి కర్నాటకు గంజాయిని తరలిస్తున్న స్మగ్లర్‌ను ఆమనగల్లు పోలీసులు, శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. బుధవారం ఆమనగల్లు పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ జె.వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి గ్రామానికి చెందిన బైరి శ్రీనివాస్ ఏపీలోని వైజాగ్ ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. స్మగ్లర్ శ్రీనివాస్ ఏజెన్సీకి చెందిన శ్రీలత నుంచి 12.5 కేజీల గంజాయిని కొనుగోలు చేసి కర్నాటక రాష్ట్రంలోని బెంగుళూరు ప్రాంతానికి చెందిన ఉమేశ్‌కు విక్రయించేందుకు ఆర్టీసీ బస్సులో వెళ్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం సాయంత్రం శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అతని వద్దనున్న సూట్ కేస్‌లో గంజాయి లభ్యమైంది. దీంతో కేసు నమోదు చేసి శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించామని.. శ్రీలత, ఉమేశ్‌లు పరారీలో ఉన్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాం, ఏఎస్ఐలు బాల్‌రెడ్డి, యాదయ్య, సిబ్బంది ఉన్నారు.

శరణ్య ఎక్కడమ్మా..?

- కన్న పేగుకోసం తల్లి తండ్లాట
- భర్తపైనే అనుమానం ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు

షాద్‌నగర్‌రూరల్: మానవత్వం మంటగలుస్తోంది.. తాగుడు బానిసైన తండ్రిని ఏడాదిన్నర పాప వద్ద ఉంచి పనికి వెళ్తే పాపనే కనపడకుండా చేశాడు ఆ కసాయి. దీంతో ఆతల్లి బిడ్డ ఆచూకీ కోసం తల్లిడిల్లుతోంది. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లికి చెందిన పద్మ, బోవయ్య దంపతులకు ఒక బాబు, పాప సంతానం. భర్త తాగుడుకు బానిసవ్వడంతో పద్మ హోటల్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ప్రతిరోజు సాయంత్రం 4గంటలకు పనికి వెళ్లి రాత్రి ఒంటి గంటకు వస్తుంది. ఆమె ఎప్పటిలాగే మంగళవారం పిల్లల వద్ద తండ్రిని ఉంచి పనికి వెళ్లింది. రాత్రి 11గంటలకు హోటల్ వద్దకు వెళ్లిన బోవయ్య పిల్లలు ఏడుస్తున్నారని పద్మను ఇంటికి రమ్మన్నాడు. ఇంటికి వచ్చిచూస్తే కూతురు శరణ్య(18నెలలు) కనిపించలేదు. దీంతో పాప ఎక్కడఅని భర్తను నిలదీసింది. బైపాస్ సమీపంలోని చెట్ల పొదల్లో పడవేశా.. చెరువులో వేశా.. అంటూ పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పద్మ పోలీసులను ఆశ్రయించింది. భర్తపైనే అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు బైపాస్ సమీపంలోని చెట్ల పొదలు, చెరువులో గాలించినా పాప ఆచూకీ లభించలేదు. తాగుడుకు బానిసైన తండ్రి పాప ఎవరికైనా విక్రయించాడా..? హత్యచేసి మరెక్కడైనా పడవేశాడా, భార్యాభర్తలమధ్య కలహాలున్నాయా అనే కోణంలో విచారణ చేపడుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీఐ రాంరెడ్డి తెలిపారు.

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

రాజేంద్రనగర్: నియోజకవర్గం పరిధిలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లను చేపడుతున్నట్లు రిటర్నింగ్ అధికారి మల్లయ్య వెల్లడించారు. ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గం పరిధిలో మొత్తం 535 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. అదనంగా మరో 10 బూత్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. బుధవారం నాటికి రూ.5,53,590మంది ఓటర్లుగా నమోదై ఉన్నారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ పేరును ఓటర్ లిస్టులో నమోదు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌తో పాటు బీఎల్‌ఓల వద్ద నమోదు చేసుకునేందుకు అవకాశముందన్నారు. కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. మార్పులు, చేర్పులకు అవకాశం లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం 41 రూట్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రూట్‌కు ఒక సెక్టోరల్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ సెక్టోరల్ తమ పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్ వద్దకు వెళ్లి మౌలిక వసతులన్నీ పరిశీలిస్తారన్నారు. ఎప్పటికప్పుడు వసతులపై నివేదిక అందిస్తారన్నారు. నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లలో దాదాపు మౌలిక వసతులన్నీ ఉన్నాయన్నారు. కొన్ని బూత్‌లలో వికలాంగులు, వృద్ధుల కోసం ర్యాంపులు లేవని.. వాటిని నిర్మించాలని జీహెచ్ఎంసీ, మున్సిపల్ కార్పొరేషన్, గ్రామ పంచాయతీ అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 80 ఏళ్లు పైబడి నడవలేక ఉన్న వారు వికలాంగులు తదితర వారి కోసం నేరుగా ఇంటి వద్దకే వెళ్లి ఓటు వేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. వారికి ప్రత్యేకంగా ఫామ్–12డీ ఫామ్‌ను అందిస్తామన్నారు. వాటిని పూర్తి చేసి బీఎల్‌ఓకు అందించాలన్నారు. బీఎల్‌ఓ పరిశీలించి అందుకు సంబంధించి నిర్ణయం తీసుకుంటారన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని... ఫ్లైయింగ్ స్క్వాడ్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపడుతున్నారన్నారు. తమ ప్రాంతంలో ఎదైన సమాచారం ఉంటే పోలీసులు కానీ... తమకు కానీ సమాచారం అందించాలన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువగా నగదును తీసుకొని ప్రయాణించే సమయంలో అందుకు సంబంధించిన పూర్తి వివరాలు తమ వద్ద భద్రపరుచుకోవాలన్నారు. డబ్బుకు సంబంధించిన పత్రాలు లేకుంటే వాటిని సీజ్ చేస్తామన్నారు. రూ.10 లక్షల లోపు ట్రెజరీకి సమాచారం అందించి జమ చేస్తున్నామన్నారు. రూ.10 లక్షల కంటే ఎక్కువగా ఉంటే ఐటీ అధికారులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. డబ్బుకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కానీ.. ఐటీ శాఖ కార్యాలయంలో పూర్తి ఆధారాలు చూపించి తీసుకొచ్చన్నారు. ఓటర్లు ప్రస్తుతం ఆన్‌లైన్ తమ పేర్లను సరి చూసుకోవాలన్నారు. ఎన్నికల రోజు తమ పేరు లేదని తెలపడం కంటే ప్రస్తుతం ఆన్‌లైన్‌తో పాటు వివిధ యాప్‌లలో ఓటర్‌గా చూసుకోవచ్చన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై నార్సింగి పోలీసులు, రెవెన్యూ అధికారులు వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ద్విచక్ర వాహనాలతో పాటు, కార్లను క్షుణంగా తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి డబ్బులు తరలిస్తున్న వాహనాలను గుర్తించి నగదును సీజ్ చేస్తున్నారు.ఎవరైనా డబ్బులు తరలించే వారు అందుకు సంబంధించిన పేపర్లను చూపించాల్సిన ఉంటుందన్నారు.